క్లుప్తంగా

తప్పిన ప్రమాదం

మానవపాడు: మండల కేంద్రం నుంచి రైతు కృష్ణ పంటను గోదాములకు తరలించేందుకు మిరప లోడ్‌తో డీసీఎంలో తీసుకువెళ్తుండగా మిరప సంచులకు విద్యుత్ వైర్లు తాకి మంటలు చెలరేగాయి. గమనించిన రైతులు వెంటనే డీసీఎంను ఆపి మంటలను ఆర్పేశారు. డీసీఎంలో 300 మిరప సంచులతో లోడ్ చేశారు. ఎటువంటి ప్రమాదం సంభవించలేదు. ప్రధాన రహదారి వద్ద విద్యుత్ వైర్లు కిందకు వేలాడుతున్నాయి. వాటిని పెద్ద విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి వైర్లను పైకి ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులను మండల ప్రజలు, రైతులు కోరుతున్నారు.

వ్యాధి నిరోధక టీకాలు వేయించండి



అయిజ: పశువుల్లో వచ్చే గాలికుంటు వ్యాధిని అరికట్టేందుకు ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న వ్యాధి నిరోదక టీకాలు వేయించాలని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్వరూపారాణి అన్నారు. సోమవారం మండలంలోని తొత్తినోనిదొడ్డిలో మొత్తం 430 పశువులకు వెటర్నరీ సిబ్బంది టీకాలు వేశారు. గాలికుంటు వ్యాధి సోకిన పశువుల నోట్లో, కాలి గిట్టలలో పుండ్లు ఏర్పడుతాయని, అవి మేత మేయలేక నీరసపడిపోతాయని, నడువలేని పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. వ్యాధి తీవ్రమైతే పశువులు చనిపోతాయని, వ్యాధి నిరోదక టీకాలు వేయించి పశువులను కాపాడుకోవాలని సూచించారు.

రామప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు



రాజోళి: మండల కేంద్రంలోని తుంగభద్ర నది మధ్యలోఉన్న రాంపాటి శివాలయంలో భక్తులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివుడికి ప్రీతికరమైన రోజు కావడంతో స్వామి వారికి అర్చనలు, అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. నది మధ్యలో ఉన్న ఆలయానికి కాలినడకతో వెళ్లి పూజలు చేశారు.

కమాండెంట్‌ను సన్మానించిన నాయకులు



ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పదో బెటాలియన్ కమాండెంట్ సాంబయ్యను సోమవారం బీఆర్ఎస్ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్రీధర్‌రెడ్డి పటాలంలోని కమాండెంట్ కార్యాలయంలో ఆయనను కలిసి మొక్కను అందించి శాలువాతో సత్కరించారు. ఆయన వెంట రామన్‌గౌడ్, ప్రవీణ్, భాస్కర్ ఉన్నారు.

కేసు నమోదు

గద్వాల క్రైం: అకారణంగా దాడి చేసిన సంఘటనలో ముగురిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. పట్టణంలోని భీం నగర్ కాలనీలో కేశవ్‌కుమార్ నివాస గృహ నిర్మాణ పనులు చేయిస్తున్నాడు. ఈ క్రమంలో ఇంటి సమీపంలో ఉంటున్న నాగరాజు ఇంట్లోకి దుమ్ము, ధూళి, రాళ్లు వస్తున్నాయంటూ రెండు రోజుల నుంచి గొడవ పడుతున్నాడు. సోమవారం ఉదయం ఇదే విషయంపై ఇరువురి మధ్య వివాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో శశిధర్‌రెడ్డి, నాగరాజు, ఆయన సతీమణిలు కేశవ్‌కుమార్ కుటుంబ సభ్యులపై అకారణంగా దాడి చేశారు. దాడిలో వైభవ్, లక్ష్మణ్, కేశవ్‌కుమార్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడు ఫిర్యాదు మేరకు దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పుల్లూరులో చోరీ

ఉండవెల్లి: మండలంలోని పూల్లూరులో ఆదివారం అర్ధరాత్రి సమయంలో కుమ్మరి ఈశ్వరమ్మ ఇంట్లో కర్నూల్‌కు చెందిన తెలుగు రాజు చోరీ చేసి రూ.15వేలు అపహరించాడు. ఈశ్వరమ్మ కుటుంబ సభ్యులు ఇంటి మిద్దెపై పడుకున్నారు. చిన్నకుమారుడు బాత్‌రూమ్‌కు వెళ్లడానికి నిద్రలేచాడు. ఇంటి తలుపు పగుల గొట్టిన ట్లు గమనించాడు. ఈ విషయం ఈశ్వరమ్మ ఫి ర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యా ప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

మరో రెండు చోట్ల..

శాంతినగర్: వడ్డేపల్లి పుర పరిధిలోని పైపాడు మిట్టల పరిధిలోని చిరు వ్యాపారుల బంకుల్లో ఆదివారం రాత్రి రెండు చోట్ల చోరీ జరిగింది. జిలేబి డబ్బా, కిరాణ బంకులో చోరీ జరిగినట్లు బాధితులు మల్లికార్జున్, ఏసులు తెలిపారు. జిలేబి సెంటర్‌లో సరుకులు, వస్తువులు, కిరాణ బంకులో వస్తువులు పోయినట్లు బాధితులు పేర్కొన్నారు.

పకడ్బందీగా ‘పది’ పరీక్షలు



నందిన్నెలో పరీక్ష రాయడానికి వెళ్తున్న విద్యార్థులు



మానవపాడులో..



ఉండవెల్లి పరీక్ష కేంద్రం వద్ద ఎస్ఐ శ్రీనివాసులు

మానవపాడు: పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు చీఫ్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పది పరీక్షలు నిర్వహించారు. పరీక్ష కేంద్రంలో మొత్తం 284 మంది విద్యార్థులకు గాను, 282 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద ఎస్ఐ చంద్రకాంత్ పకడ్బందీగా బందోబస్త్ నిర్వహించారు. పోలీస్ సిబ్బందితో చుట్టు పక్కల ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చర్యలు తీసుకున్నారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని పది పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 137 మంది విద్యార్థులు, ప్రైమరి పాఠశాలలో 131 మంది విద్యార్థులు, మైనార్టీ గురుకుల పాఠశాలలో 150 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఫ్లెయింగ్ స్క్వాడ్ రాజు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ఎస్ శ్రీనివాసులు పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసి భద్రత ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో చీఫ్ సూపరింటెండెంట్ అమరేందర్‌రెడ్డి, శ్రీనివాసులు, నిర్మల జ్యోతి పాల్గొన్నారు.

రాజోళి: పదో తరగతి పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా జరిగాయి. మండలంలోని మాన్‌దొడ్డి, పెద్దతాండ్రపాడు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు శాంతిగనర్‌లో పరీక్షకు వెళ్లగా, రాజోళిలోని 104 మంది విద్యార్థులకు రాజోళి కేంద్రంలో పరీక్ష నిర్వహించగా, 102 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈఓ నర్సింహ తెలిపారు.

మల్దకల్: మండల కేంద్రంలో పరీక్ష కేంద్రాన్ని తహసీల్దార్ జుబేర్ మోహినుద్దీన్, ఎస్ఐ సురేష్‌గౌడు తనిఖీ చేశారు. విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు చీఫ్ సూపరింటెండెంట్‌లు శివశంకర్, జహిరుద్దీన్, శోభారాణిలు తెలిపారు. మొదటి రోజు పరీక్షకు 467మందికి గాను 466మంది హాజరైనట్లు తెలిపారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఉమ్మడి ఇటిక్యాల మండలంలో మొదటి రోజు పరీక్షకు 616 మంది విద్యార్థులకు గాను 614 మంది హాజరైనట్లు మండల విద్యాధికారి రాజు తెలిపారు. కోదండాపురం, కొండేరు పరీక్ష కేంద్రాలకు విద్యార్థులంతా పూర్తి స్థాయిలో హాజరయ్యారని, ఇటిక్యాల, పదో పటాలంలోని పరీక్ష కేంద్రాలకు ఒక్కొక్కరు చొప్పున గైర్హాజరైనట్లు తెలిపారు.

ధరూరు: మండలంలో ధరూరు, ఉప్పేరు, మార్లబీడు గ్రామాల్లో పరీక్షలు నిర్వహించారు. ధరూరులో 265కు మంది విద్యార్థులు హాజరైనట్లు అధికారులు తెలిపారు. ఉప్పేరులో 172కు గాను 171 మంది, మార్లబీడు సెంటర్‌లో 178కి గాను 177 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు.

అయిజ: మండల కేంద్రంలో మొత్తం 986 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా 11 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఎస్ఐ విజయ భాస్కర్ పోలీస్ సిబ్బందితో పరీక్ష కేంద్రాల వద్ద విధులు నిర్వహించారు.

కేటీదొడ్డి: మండల వ్యాప్తంగా 293 మంది విద్యార్థులకు గాను నందిన్నె, పాతపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. నందిన్నెలో 166 మంది విద్యార్థులకు గాను 163 మంది విద్యార్థులు, పాతపాలెం సెంటర్‌లో 127కు గాను 126 మంది హాజరైనట్లు ఎంఈఓ సురేష్ తెలిపారు. ఆయా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు.

శాంతినగర్: విద్యాశాఖ, పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో పది పరీక్షలు ప్రశాంతంగా కొనసాగాయి. జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల శాంతినగర్‌లో 260కి, 257 మంది, రవీంద్ర ఎయిడెడ్ పాఠశాలలో 158 మందికి, 157 మంది, రాఘవేంద్ర పాఠశాల సెంటర్‌లో 259 మంది విద్యార్థులు హాజరయ్యారు. డిపార్ట్‌మెంటల్ అధికారులు, ఇన్విజిలేటర్ల ఆధ్వర్యంలో నిర్వహించారు.

గట్టు: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల, గురుకుల పాఠశాల, మాచర్ల ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. గట్టులో 125 మంది విద్యార్థులు, గురుకుల పాఠశాలలో 210 మంది విద్యార్థులు, మాచర్ల ఉన్నత పాఠశాలలో 118 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.



ధరూరులో పరీక్ష రాసి వస్తున్న విద్యార్థులు



ఎర్రవల్లిలో..



అయిజలో పరీక్ష కేంద్రం వద్ద..



గట్టులో గురుకుల పాఠశాల పరీక్ష కేంద్రం

సామూహిక అక్షరాభ్యాసం



ఉప్పేరులో చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన చేయిస్తున్న డీడబ్ల్యూ పీడీ సుధారాణి

ధరూరు: పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని ఉప్పేరులో ఘనంగా సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా డీడబ్ల్యూ పీడీ సుధారాణి, సీడీపీఓ హేమలత, సూపర్‌వైజర్ అరుణలు మాట్లాడారు. పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా గర్భిణులు, బాలింతలు రక్తహీత సమస్య నుంచి బయట పడ వచ్చన్నారు. చిరు ధాన్యాలను రోజు వారి ఆహారంలో తీసుకోవడం వల్ల అనేక ప్రయోజనాలు సమకూరుతాయన్నారు. ప్రతి మహిళ, బాలింత, గర్భిణులు పోషకాహారం తీసుకోడం ద్వారా మంచి సమాజ నిర్మాణం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం, అన్నప్రాసన, గర్భిణులకు సామూహిక శ్రీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఇందిర, కృష్ణవేణి, గాయత్రి, శోభారాణి, ఆయాలు, ఆశాలు పాల్గొన్నారు.

గర్భిణులకు సీమంతం



ఆలూరు అంగన్‌వాడీ కేంద్రంలో సీమంతం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

గట్టు: మండలంలోని ఆలూరు గ్రామంలోని నాల్గో అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రం పరిధిలోని గర్భిణులకు సాంప్రదాయ బద్ధంగా సీమంతం నిర్వహించారు. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని అంగన్‌వాడీ టీచర్ ఇందిర తెలిపారు. కార్యక్రమంలో సహాయకురాలు లలిత, గర్భిణులు, బాలింతలు, మహిళలు పాల్గొన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలి



మానవపాడు సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి

మానవపాడు: వేసవిలో గ్రామాలలో నీటి ఎద్దడి లేకుండా పాత బోర్లను మరమ్మతులు చేసే విధంగా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని కొత్తగా వచ్చిన పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఎన్నికల అమల్లో ఉన్నందున తప్పకుండా పోస్టర్లు, నాయకులు గోడలపై రాతలు ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. పంచాయతీ ట్యాంకర్ మరమ్మతుకు గురైతే వాటిని రిపేర్ చేయించి అందుబాటులోకి తేవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అయిజ: వేసవి కాలంలో తీవ్రమైన ఎండల వల్ల తాగునీటి ఎద్దడి ఏర్పడుతుందని, బోరుబావులకు మరమ్మతులు నిర్వహించి తాగునీటి ఎద్దడిని నివారిద్దామని ఎంపీపీ ప్రహ్లాదరెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపీడీఓ వెంకటయ్య ఆధ్వర్యంలో ఎంపీపీ ప్రహ్లాదరెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడారు. మిషన్ భగీరథ నీరు ఏప్రిల్ నెలలో వచ్చే అవకాశం లేదని, ఆయా గ్రామాల్లో గతంలో ఏర్పాటు చేసిన బోరుబావులను కడిగించి, వాటికి సింగిల్ ఫేజ్ మోటర్లు లేదా చేతిపంపులను అమర్చాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ, కోఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగులపై దాడులు సమంజసం కాదు

ధరూరు: విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులపై దాడులు చేయడం సమంజసం కాదని మండల పంచాయతీ కార్యదర్శులు అన్నారు. కోడేరు మండల ఎంపీడీఓపై దాడికి నిరసనగా సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ కృష్ణమోహన్, పంచాయతీ కార్యదర్శులు తిరుపతిరెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్యదర్శులు

తాగునీటికోసం చందాలు వసూలు



తాగునీటి సమస్య పరిష్కారం కోసం చందాలు వసూలు చేస్తున్న గ్రామస్తులు

అయిజ: మండలంలోని సంకాపురంలో తాగునీటి సమస్యను పరిష్కరించుకునేందుకు గ్రామస్తులు సోమవారం గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి రూ. 200 చొప్పున చందాలు వసూలు చేశారు. గ్రామానికి తాగునీటి సరఫరా చేసే బోర్ మోటర్ నాలుగు రోజుల క్రితం కాలిపోయింది. తాగునీటికోసం గ్రామస్తులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామ పంచాయతీలో నిధులు లేకపోవడంతో తాగునీటి సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. మిషన్ భగీరథ తాగునీటి సరఫరా సరిగా లేకపోవడంతో గతంలో సర్పంచ్ బోరుబావులకు మోటార్‌లు అమర్చి తాగునీటి సమస్య తలెత్తకుండా చూశారు. ఐదేళ్ల కాలంలో మోటార్లు అనేకసార్లు మరమ్మతులకు గురయ్యాయి. అప్పట్లో సర్పంచే మరమ్మతులు చేయించారు. మోటార్లకు సంబంధించి కరెంట్ బిల్లు రూ. 5 లక్షలు చెల్లించాల్సి ఉంది. కలెక్టర్ స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేడు వ్యవసాయంపై వీడియో కాన్ఫరెన్స్

అయిజ: మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి శంకర్‌లాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులతో వ్యవసాయ శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయిల్‌ఫాం, కూరగాయల సాగు, వేసవి పంటలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. పంటలకు ఆశించే పురుగులు, తెగుళ్లు, వాటి నివారణకు సమగ్ర యాజమాన్య పద్ధతుల గురించి సలహాలు, సూచనలు చేస్తున్నట్లు తెలిపారు. వరిపంటలో ప్రస్తుతం పాటించాల్సిన జాగ్రత్తలపై ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం జగిత్యాల వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ బి.శ్రీనివాస్ మాట్లాడుతారని, ఆయిల్ ఫాం సాగు గురించి శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం నుంచి డీన్ ఆఫ్ హార్టికల్చర్ శాస్త్రవేత్త డాక్టర్ రాజశేఖర్, వేసవి కూరగాయల సస్యరక్షణ గురించి అఖిల భారత సస్యరక్షణ మందుల అవశేషాల పరిశోధన విభాగం రాజేంద్రనగర్ శాస్త్రవేత్త డాక్టర్ కె. కవిత అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఏఓ శంకర్‌లాల్ కోరారు.

అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి



కేటీదొడ్డి: అపరిచితులపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ శ్రీనివాస్‌రావు అన్నారు. మండలంలోని రంగాపురంలో సోమవారం రాత్రి రోడ్డు భద్రత, ట్రాఫిక్, సైబర్‌నేరాలపై ప్రజలకు కళాజాత బృందం ఆధ్వర్యంలోని అవగాహన కల్పించారు. కొత్త వ్యక్తులు గ్రామంలోని అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. బాల్యవివాహాలు చేసినా ప్రోత్సాహించినా వారిపై కేసులు నమోదు చేస్తామని, మహిళలను బాలికలను వేధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రాధమ్మ, షీటీం కళాబృందం సభ్యులు కృష్ణ, రామాంజనేయులు, భరోసా సిబ్బంది, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

రికార్డులు తనిఖీ



మానవపాడు: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం జిల్లా ముఖ్య కార్యనిర్వాహక అధికారి కాంతమ్మ ఆధ్వర్యంలో కార్యాలయ రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. 2023–24 సంబంధించి పలు రికార్డులను తనిఖీ చేశారు. కార్యాలయానికి సంబంధించి ప్రతి రికార్డులను అప్డేట్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యాలయం ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనులు వాటి పురోగతిపై ఆరా తీశారు. కార్యాలయానికి సంబంధించి రికార్డులతో పాటు హాజరు రిజిస్టార్‌ను తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణకు సంబంధించి పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో రవికుమార్, నాగరాజు, ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి, రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



గద్వాల అర్బన్: ఆపదలో ఉన్న వారిని రక్షించేందుకు రక్తదానం చేస్తే ప్రాణదానం చేసినట్లేనని మెడికల్ ఆఫీసర్ వేసీలా తేజస్వీ, డాక్టర్ వంశీ, న్యాయవాది వరలక్ష్మీదేవి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో ప్రిన్స్‌స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. అన్ని దానాల కన్నా రక్తదానం గొప్పదన్నారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన వారికి సర్టిఫికేట్లను అందజేశారు. కార్యక్రమంలో గిరిబాబు, సభ్యులు అనుదీప్, వినయ్, కృష్ణ, నాగరాజు ఉన్నారు.

నేడు సీతారాముల కల్యాణం

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని కోదండ రామస్వామి ఆలయంలో మంగళవారం సీతారాముల కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ సురేందర్ రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కల్యాణ వేడుక తిలకించాని కోరారు.

నేడు విద్యుత్ అంతరాయం

అయిజ: నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు అయిజ మండలంలోని 33/11 కేవీ వెంకటాపురం సబ్‌స్టేషన్ వద్ద మాన్‌దొడ్డి సబ్‌స్టేషన్ వైపు 33 కేవీ ఇన్, అవుట్ సౌకర్యం ఏర్పాటు చేస్తామని, దాని కోసం వెంకటాపురం సబ్‌స్టేషన్‌కు ఎల్‌సీ తీసుకునేందుకు మంగళవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టీఎస్ఎస్ పీడీసీఎల్ ఏడీఈ గోవిందు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అయిజ మండలంలోని వెంకటాపురం సబ్‌స్టేషన్ పరిధిలోని వెంకటాపురం, పర్దీపురం, కిష్టాపురం, కురవపల్లి, యాపదిన్నె, గుడిదొడ్డి, ఉప్పల, ఉప్పల క్యాంప్, నౌరోజీ క్యాంప్ గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వడ్డేపల్లి మండలంలోని తనగల, రాజోళి మండలంలోని మాన్‌దొడ్డి, పెద్ద ధన్వాడ, చిన్న ధన్వాడ, నరసూరు పచ్చర్ల, గ్రామాలకు రెండు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఏడీఈ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎన్నికల ప్రచారంలో నాయకులు

అయిజ: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సోమవారం బీజేపీ నాయకులు మండలంలోని వివిధ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండలంలోని కుటుకనూరు, సిందనూ రు, తొత్తినోనిదొడ్డి, భూంపురం గ్రామాల్లో బీజే పీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.

తాగునీటి కష్టాలు



గట్టు: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో ప్రజలకు తాగు నీటి కోసం కష్టాలు పడుతున్నారు. బీసీ కాలనీలో కొత్త ఇళ్లకు తాగునీటి పైపులైన్ లేక పోవడంతో మహిళలు ఇబ్బంది పడుతున్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరా లేక పోవడంతో మహిళలు ఖాళీ బిందెలతో తాగునీటి కోసం పరిగెత్తే పరిస్థితి ఏర్పడింది. వేసవితో తాగునీటి కోసం చాలా ఇబ్బంది పడే పరిస్థితి ఉందని కాలనీ వాసులు వాపోయారు. సమస్య మరింత జఠిలం కాకముందే అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

ఉండవెల్లి: మండలంలోని అలంపూర్ చౌరస్తాలో పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పెట్రోలింగ్ అధికారులు వ్యాన్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం పెట్రోలింగ్ అధికారులు వాహనాలు తనిఖీ చేస్తుండగా కర్నూల్‌కు చెందిన డ్రైవర్ పింజరి అబ్దుల్ మజీద్ అక్రమంగా 5 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం తరలిస్తుండగా పట్టుబడ్డాడు. ఓమిని వ్యాన్ ఓనర్ ఇమాంపురం గ్రామానికి చెందిన మహ్మద్ రఫీ, డ్రైవర్ అబ్దుల్ మజీదులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సమస్యల చెంత.. మల్దకల్ సంత


- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందుల్లో వ్యాపారులు



మల్దకల్‌లో రోడ్డుపై నిర్వహిస్తున్న సంత

మల్దకల్: మండల కేంద్రంలో ప్రతి శనివారం నిర్వహించే సంత దినదినాభివృద్ధి చెందుతూ, ప్రజాదరణ పొందినా వ్యాపారులకు, ప్రజలకు కనీస సౌకర్యాలు లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. మండల కేంద్రంతో పాటు అయిజ, గద్వాల, ఇటిక్యాల, గట్టు తదితర మండలాల నుంచి వందలాదిగా ప్రజలు ప్రతి శనివారం మల్దకల్ సంతకు వచ్చి నిత్యవసర సరుకులు తీసుకెళ్తుంటారు. గద్వాల జిల్లాలోనే ఎండు మిర్చికి ప్రసిద్ధిగాంచిన ఈ సంతకు జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున రావడం సర్వసాధారణం. సంతను గ్రామంలోని రోడ్డుపై నిర్వహిస్తుండడంతో వ్యాపారులు, ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బస్సులు, లారీలు, పెద్ద వాహనాలు వచ్చినప్పుడు ట్రాఫిక్ జామ్ కావడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. సంతలో తైబజార్ ద్వారా ప్రతి వారం క్రమం తప్పకుండా తైబజార్ వసూలు చేస్తున్నా వ్యాపారస్తులకు మాత్రం సౌకర్యాలు కల్పించడం లేదని వాపోతున్నారు. వ్యాపారులకు, నిత్యవసర సరుకుల కోసం వచ్చే ప్రజలకు కనీస వసతులు కల్పించాలని ఎన్నో సార్లు కోరినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ప్రతి శనివారం ముక్కుపిండి తైబజార్ వసూలు చేస్తారు కానీ సంతలో ఎలాంటి సౌకర్యాలు కల్పించడం లేదు. తెచ్చుకున్న భోజనం తినడానికి కూడా మంచినీళ్లు దొరకని పరిస్థితి ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సంతను నిర్వహించేందుకు ప్రత్యేక స్థలాన్ని కేటాయించి నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.


సంతలో సౌకర్యాలు లేవు



ప్రతి శనివారం నిత్యవసర వస్తువులు కొనేందుకు సంతకు వస్తా. కానీ సంతలో తాగడానికి నీళ్లు కూడా దొరకవు. దూర ప్రాంతం నుంచి ఇక్కడి వచ్చి హోటళ్లలో నీళ్లు తాగుదామంటే హోటల్ యజమానులు టిఫిన్, టీ తాగితే గాని నీళ్లు ఇవ్వరు.

– పద్మమ్మ, అమరవాయి


సంతకు వెళ్లాలంటే భయం



ప్రతి శనివారం జరిగే మల్దకల్ సంతకు వెళ్లాలంటే భయంగా ఉంది. కానీ తప్పడం లేదు. సంతలో కూరగాయలు, ఇతర వస్తువులు కొనేందుకు వెళ్తాను. షాపుల కంటే సంతలో కాస్త ధరలు తక్కువగా ఉంటాయి. ఇరుకైన రోడ్డుపై సంత సాగడం ఇబ్బందిగా ఉంది. వాహనాలు తిరుగుతుండడంతో ఎక్కడ తగులుతాయోనని భయంగా ఉంది.

– సుస్మిత, మల్దకల్

తైబజార్ వసూలు చేస్తారు..



క్రమం తప్పకుండా ప్రతి శనివారం సంతకు రాగానే తైబజార్ ముక్కుపిండి తీసుకుంటారు. కానీ సంతలో వ్యాపారస్తులకు ఎలాంటి సౌకర్యాలు లేవు. తైబజార్‌పై ఉన్న ధ్యాస షెడ్లను ఏర్పాటు చేయడంలో లేదు. కనీసం తాగడానికి నీటి సౌకర్యం కూడా లేదు.

– బుడ్డన్న, కుర్తిరావల్‌చెర్వు